

# పరీక్షల ప్రేమ

"హలో! నూతన్!"
వంగపండు రంగూ, కోకోకోలా రంగూ కలగలపిన వెంకటగిరి జరీ చీరలో గుమ్మం అవతల నిలబడి తనను పలకరిస్తోన్న సమీరను చూసి "కలయో- ఇది లేక--?"

# డా॥ సి. ఆనందారామం

అనే విభ్రాంతి లోకి జారుకున్నాడు నూతన్.

సన్నగా-పొడుగ్గా-పచ్చగా- నొక్కు నొక్కుల జుట్టుతో. మెరిసే కళ్ళతో ఆకర్షణీయంగా ఉన్న సమీర. ఎం.ఏ. మొదటి సంవత్సరంలో జాయినయినప్పుడే, అతన్ని ఆకర్షించింది. ఎం.ఏ.లో యూనివర్శిటీలో చేరింది మొదలు, పి.హెచ్.డి. విద్యార్థిగా ఎదిగేవరకు గడించిన నాలుగేళ్ళ అనుభవం,- సహజంగా ఉన్న చొరవ-బేచ్ తర్వాత బేచ్‌గా, తనతో స్నేహం చేసిన రకరకాల అమ్మాయిలు కలిగించిన ఆత్మవిశ్వాసం- వీటితో మొదట్లోనే ఆ అమ్మాయితో స్నేహం చెయ్యటానికి ప్రయత్నించాడు. కాని, సమీర నూతన్‌ని పూచిక పుల్లలా తీసి పారేసింది. మహారాణిలా ఠీవిగా, నూతన్‌ని గమనించనట్లే సాగిపోయేది. ఈ అమ్మాయితో లాభం లేదనుకొని. ఫైనల్‌లో ఉన్న రాధారాణితో స్నేహాన్నే కంటిన్యూ చేస్తున్నాడు. యూనివర్శిటీ ఆవరణలో రాధరాణి తన దగ్గర రిఫరెన్స్ బుక్స్ తీసుకొంటున్నప్పుడు, తనూ రాధారాణి లాన్స్‌లో కూచుని, డిస్కషన్స్ చేసుకుంటున్నప్పుడు, ఎగ్జామినర్‌ని ఠోల్తా కొట్టించేలాగ, మెస్సెస్ ఎలా తయారు చేసుకోవాలో, రాధారాణికి తను హింట్స్ ఇస్తున్నప్పుడు'- అప్పుడప్పుడు దూరం నుంచి సమీర తనను గమనించటం నూతన్ చూశాడు. తను చూడగానే పొగరుగా గిరుక్కున ముఖం తిప్పుకుని వెళ్ళిపోయేది.

అలాంటిది, సమీర. తనంత తాను వచ్చింది. "వెల్‌కం, వాట్ ఎ ప్రజెంట్ సర్‌ప్రైజ్!" అన్నాడు. మురిపెంగా నవ్వుతూ గదిలో అడుగు పెట్టింది.

"హాస్టల్‌లో వుండటం లేదేం? విడిగా గది అద్దెకు తీసుకొన్నావా-దేనికి?" అడిగింది, అతడి కేంప్ కాట్ మీద కూచుంటూ.

'సిబోటీ వాళ్ళు వస్తారని-----!' మనసులో అనుకున్నాడు.

"హాస్టల్‌లో చదువు సరిగా సాగదు!

వాస్తవిక ప్రణయగాథలు

అందుకని --" అన్నాడు పైకి.

"నీ గదిలో పెద్దగా రిఫరెన్స్ బుక్స్ లేవే?" అంది చుట్టూ చూస్తూ---

"అన్నీ గదిలో దాచుకోను. నా ఫ్రెండు దగ్గర వుంటాయి. నాకు పెద్ద వానర సేన వుంది. నాకు ఏ బుక్ కావాలంటే, ఆ బుక్ ఏ మూల వున్నా సంపాదించి తెస్తారు. నేను హాస్టల్ స్టూడెంట్స్‌కి లీడర్‌ని!"

"మీరు గోల్డు మెడలిస్టు అట కదూ?'

"ఆఁ! ఏదో, గోల్డ్ మెడల్ తెచ్చుకోవటం పెద్ద కష్టం కాదులెండి!" లోలోపల గర్వపడిపోతూ పైకి మోడెస్టుగా అన్నాడు.

"అన్నీ వచ్చిన వాళ్ళకి ఏదీ కష్టం కాదు!" మెచ్చుకోలుగా అని, "అప్పుడు మీరు తయారు చేసుకున్న నోట్స్ ఉన్నాయా?" అని అడిగింది.

లోలోపల నవ్వుకున్నాడు నూతన్.

"లేవు! ఉండవు! నేను నోట్స్‌లా ఏదీ తయారు చెయ్యను! పాయింట్స్‌ని నోట్ చేసుకుంటాను- అంతే! ఎప్పటికప్పుడు కొత్తగా ఉండాలి మన వ్యాసాలు!"

"అదెలా? టాపిక్స్ ఒకటే గదా?"

"అక్కడే వుంది కిటుకు! ఎప్పటి కప్పుడు ఎవడో ఒకడు, ఉన్న దానిని ఖండిస్తోనో, లేని దానిని చూపిస్తూనో ఏదో ఒక సిద్ధాంతం లేవదీస్తూనో ఉంటాడు గదా? అలాంటివి పట్టుకోవాలి. వాటికి మన వ్యాఖ్యానం జోడించి, ఏదో పెద్ద పరిశోధన జరిపినట్లు రాసేస్తే యెగ్జామినర్‌కి మతిపోతుంది, ఆఫ్ కోర్స్, అసలు ఉంటే...."

నవ్వింది సమీర.

"అయితే మీరు మారుమూలల మేగజైన్స్. ఎప్పటి కప్పుడు కొత్తగా వచ్చిన పుస్తకాలు చదువుతుంటారా?"

"నా సైన్యం అదే! నా మిత్ర బృందం ఉందని చెప్పాను కదా! నాకేం కావాలన్నా ఆ విషయానికి సంబంధించినవి, నేల నాలుగు చెరగులా గాలించి తీసుకొస్తారు."

"ఇంత భక్తిశ్రద్ధలు నిష్కారణంగా పుట్టుకొచ్చినవేనా? లేక ఈ సేవకి వెనుక ఏవైనా లావాదేవీలున్నాయా?"

"అలాంటివి మీరు అడక్కూడదు. నేను చెప్పటానికి వీల్లేదు!"

"అయితే, మరి నే వెళ్ళనా?"

"అప్పుడే? కూర్చోండి! కాఫీ పెట్టనా? అన్నీ ఉన్నాయి."

"పరీక్షలు! చదువుకోవద్దూ?"

"బాగా ప్రిపేర్ అవుతున్నారా?"

"ఏదో! లైబ్రరీస్ అన్నీ తిరగాలంటే, బోర్!"

"తిరక్కండి! ఆ సమయంలో ఇక్కడ రిలాక్స్కండి. మీకు కావలసిన పుస్తకాలు లిస్ట్ వ్రాయండి"
"ఏం వ్రాయనూ? ఈ కెమిస్ట్రీలో మా రిఫరెన్స్ బుక్స్ కొత్తగా ఏం వచ్చాయో, మా కంటే మీకే బాగా తెలుసు!"
నవ్వాడు గర్వంగా.
"ఆల్ రైట్! బుక్స్ నేను తెప్పిస్తాను. వ్యాసాలు కూడా నేనే తయారు చేస్తాను. ఒక్క షరతు మీద...."
"ఏమిటి?"
"మీరు పుస్తకాలు కలెక్ట్ చేసుకోవటానికీ, నోట్స్ ప్రిపేర్ చేసుకోవటానికీ ఎంత టైం పడుతుందో, అంత టైం నాతో గడపాలి!"
"అంతేనా? అంత కంటే ఇంకా యెక్కువ సేపు మీతో వుండనియ్యరా? నాకయితే, పరీక్షలమాట ఎలా ఉన్నా, మీతో ఇలా కబుర్లు చెపుతూ వుండిపోవాలని వుంది."
అల్లరిగా నవ్వి కేంప్‌కాట్ మీద జార్లగిల బడింది. ఆ రోజు నుంచీ సమీరా-నూతన్‌లు జంటగా తప్ప ఒంటరిగా యెక్కడా కనపడేవారు కాదు. ఉదయం తొమ్మిది నుంచీ, సాయంత్రం అయిదు దాటేవరకూ క్లాసులున్నా లేకపోయినా, సమీర యూనివర్శిటీ ఆవరణలోనే గడిపేది. ఆ సమయంలో యెప్పుడూ నూతన్‌తోనే కనపడేది. అప్పుడప్పుడు క్లాసులెగ్గొట్టి కూడా నూతన్‌తో కాలేజిలోనే తిరిగేది! ఎవరయినా అడిగితే "ఆ లెక్చరర్ యెప్పుడూ ఒకటే పాత లెక్చర్ కొడతాడు - బోర్! నేను కొత్త విషయాల కోసం ప్రయత్నిస్తున్నాను!" అనేది నిర్లక్ష్యంగా.
కొందరు కొంటె విద్యార్థులు "కొత్త విషయాల కోసం ప్రయత్నిస్తున్నా!" అన్న మాటని మరో అర్థం వచ్చేలా రిపీట్ చేసి నర్మగర్భంగా నవ్వితే, సిగ్గుపడి బాధపడకపోగా- గర్వంగా భుజాలెగరేసేది! "అయితే, ఏమంటావ్?" అన్నట్లు ఛాలెంజింగ్‌గా చూసేది.
ఒక రోజు నూతన్ సమీరతో కాలేజి కేంటీన్‌లో టీ తాగుతున్నాడు. సమీర పక్కన ఉన్న కుర్చీ ఖాళీగానే వుంది కానీ, నూతన్‌కి అటు పక్క యెవరో ఉన్నారు- ఆ సమయంలో వచ్చింది రాధారాణి.
సమీరని ఉద్దేశించి, "నేను నూతన్‌తో మాట్లాడాలి! నువ్వు లే, అక్కడి నుంచి!" అంది అధికారాన్ని సూచిస్తూ.
సమీర వినపడనట్లే కూచుంది. తల యెత్తి కూడా చూడలేదు.

"నూతన్! సమీరని లేవమని చెప్పు. నీతో చాలా ముఖ్యమైన విషయం మాట్లాడాలి!" అంది.

నూతన్ తదేక దీక్షగా టీ సిప్ చేస్తూ కూచున్నాడు.

"నూతన్! ఈ జన్మలో నీతో ఇంకెప్పుడూ మాట్లాడను!" కన్నీళ్ళూ, రోషమూ కలిసిన గొంతుతో బెదిరిస్తున్నట్లు అంది. నూతన్ కదలబోయాడు టేబిల్ కింది నుంచి అతడి చెయ్యి గట్టిగా పట్టుకుంది సమీర. అతడు కదలలేకపోయాడు. రివ్వున తిరిగి వెళ్ళిపోయింది రాధారాణి. నూతన్ ముఖం కొంచెం రంగు మారింది. సమీర అతడి చెయ్యి వదిలి, మూతి ముడిచి,

"కావాలంటే, నువ్వూ వెళ్ళు-నేనేం నిన్ను నిర్బంధించటం లేదు!" అంది.

"ఛ! ఛ! అదేం కాదు. నిష్కారణంగా తన ఫీలింగ్స్ హర్ట్ చేసానేమోనని...."

"చేస్తే చేశావు. ఏం? తను ఇలా నలుగురిలో వచ్చి, నా మీద ఏదో అధికారం ఉన్నట్లు లేవమని అనవాచ్చా? నా ఫీలింగ్స్ హర్ట్ కావా? మేనర్స్ బ్రూట్!"

నూతన్ మాట్లాడ లేదు.

"చెప్పు! తన ప్రవర్తన అసభ్యంగా లేదూ?" రెట్టించింది.

"ఈ కాలేజిలో ఏది సభ్యం? ఏది సభ్యం?" అని మనసులో అనుకుంటూ అయోమయంగా తల ఊపాడు నూతన్ -

పరీక్షలు బాగా దగ్గిర పడుతున్నా దర్జాగా నూతన్‌తో కలిసి తిరుగుతోంది సమీర! ప్రిపరేషన్ అంతా అతడు చేస్తున్నాడు- చేయిస్తున్నాడు. అతడు సిద్ధంగా ఉంచిన దాన్ని రాత్రి కూచుని చదువుకోవటమే సమీర వంతు!

పరీక్షలు జరుగుతున్నాయి. ఆఖరు పరీక్ష రాసి లాన్‌లో ఉన్న నూతన్ దగ్గిరకొచ్చింది సమీర.

"ఇంక నాకు కనపడవు కాబోలు" దిగులుగా అన్నాడు నూతన్.

"ఎందుకు కనపడను? మళ్ళీ నీ గదికి వొస్తాను!"

"ప్రామిస్?"

"ప్రామిస్!" అతడి చేతిలో చెయ్యి వేసింది.

దూరంగా రాధారాణి నూతన్‌ని చూసి ముఖం చిట్లించుకుని వెళ్ళిపోయింది.

నూతన్ మనస్సు కలుక్కుమంది! పాపం రాధారాణి మంచి స్నేహితురాలు!

"ఎప్పుడొస్తావ్?"

"అది చెప్పలేను! కాని, తప్పకుండా వొస్తాను!"

సమీర ఎప్పుడూ ఇంతే! దగ్గిరగా వచ్చి అందరానంత దూరంలో ఉండిపోతుంది. ఆ అమ్మాయి మీద తన ప్రభావం ఏమీ లేదు. ఆమె దయ! తన భాగ్యం! అంతే!

రోజులు గడుస్తున్నాయి. సమీర మళ్ళీ నూతన్ దగ్గిరకి రాలేదు. రాధారాణి నూతన్‌తో మాట్లాడటం పూర్తిగా మానేసింది. ప్రకాష్‌తో స్నేహం చేస్తుంది.

సమీర కోసం దిగులుతో నూతన్ "మజ్నూ" అయ్యాడు. "దేవదాసు" కూడా అయిపోయాడు.

పరీక్షా ఫలితాలు వచ్చాయి. సమీరకి గోల్డు మెడల్ వచ్చింది. సంతోషమూ, దుఃఖమూ, రెండూ కలిగాయి, నూతన్‌లో! "మోసగత్తెవి" అని నిందిస్తూ సమీరకి ఉత్తరం రాసాడు.

ఉత్తరం అందుకున్న రోజునే, నూతన్ దగ్గిరకి వచ్చేసింది సమీర.

"చూసావా? నా ప్రామిస్ నిలబెట్టుకున్నాను - వస్తానన్నాను. వచ్చేసాను" ఎప్పటిలా నవ్వుతూ అంది.

"వచ్చావు, ఇన్నాళ్ళకి? అవునులే, పరీక్షలయిపోయాయిగా ఇంక నీకు నా అవసరం ఏముందీ?"

"కరెక్టు! సరిగ్గా ఊహించావు. ఎంతైనా జీనియస్‌వి. నేను ఇవాళ రెండు పనుల మీద వచ్చాను, కాదు రెండు విషయాలు చెప్పాలని వచ్చాను."

"ఏమిటవి?"

"మీ ఆవిడ వికారాబాద్‌లో పుట్టింట్లో ఉందిట కదూ!"

"అవును! ఉంటే —?"

"ఉంటే, ఏం లేదులే! నీకొకా భార్య ఉన్నంత మాత్రన, ఆవిడ వికారాబాదులో ఉన్నందు వల్ల మన ప్రేమకేమీ భంగం లేదులే! అసలు విషయమేమిటంటే, ఆవిడ ప్రైవేట్‌గా యం. ఏ. కి. కడుతోందట?"

"అవును! రాసింది!"

"ఆ ఊళ్ళోనే డిగ్రీ కాలేజిలో లెక్చరర్‌గా ఉన్న శ్రీనివాస్ ఆవిడకి చదువులో సాయం చేస్తున్నాడని విన్నాను. ఇది కూడా రాసిందా?"

దిగ్గున లేచాడు నూతన్ తన చేతి సంచిలో గబగబా చేతికందిన గుడ్డలు నాలుగు కూరుకుని చెప్పులేసుకుని "బయటికి రా!" అన్నాడు సమీరతో — —

"ఎక్కడికి? వికారాబాదుకేనా?"

"అవును!"

"గుడ్! మరి, రెండో విషయం అడగవేం?"


"చెప్పు!" అసహనంగా అడిగాడు. తన హేండ్‌బేగ్ లోంచి శుభలేఖ తీసి అందించింది.

"చి॥సౌ॥ సమీరని — చి॥భవానీ ప్రసాద్‌కి ఇచ్చి-" అయోమయంగా చూసాడు -

"ఆశ్చర్యపోకు! సడన్‌గా కుదిరింది. ఆయన నా గోల్డుమెడల్ చూసి ముచ్చట పడి నన్ను ఏరి కోరి చేసుకుంటున్నారు. అయన పని చేస్తున్నది — — —"

సమీర చెప్తున్నది వినే సహనం లేకపోయింది,నూతన్‌లో, చేతిలో శుభలేఖ సమీర మీదికి విసిరేసి, రోడ్డు మీదికి పరుగు తీసాడు, వికారాబాద్ వెళ్ళే బస్ అందుకోవటానికి.


WIN PRIZES WORTH Rs.55000



నమూనా టోటల్ : 69

| | | |
|---|---|---|
| 22 | 27 | 20 |
| 21 | 23 | 25 |
| 26 | 19 | 24 |

ప్రవేశరుసుం లేదు ! మొదట అందిన పది ఎంట్రీలకుగడియారం ఉచితం! బహుమతులు : టెలివిజన్ లేక టేప్‌రికార్డర్.

కన్సొలేషన్ బహుమతులు : జెనీవా టు ఇన్ వన్ మోడల్ ట్రాన్సిస్టర్ రూ. 310 ఖరీదైనది అమ్మకం ధరపై. ఇది సేల్స్ ప్రమోషన్ ప్రణాళిక. ఒక పోస్టుకార్డు మీద నమూనాలో చూపినట్లుగా 9 ఖాళీ గళ్ళను తయారు చేసుకొని, 18 నుండి 26 వరకు గల అంకెలను వాడుతూ, అడ్డంగా, నిలువుగా, ఐమూలగా- ఎటు కూడినా టోటల్ 63 వచ్చేలా నింపి పంపండి. ఒక అంకెను ఒకేసారి ఉపగియోంచాలి. ఎంట్రీలు 20 రోజుల్లోగా అందాలి.

**Geneva Electronics (vm)**
P. B. No. 9432, Delhi-110 051.